క్లుప్తంగా

వేంకటేశ్వర కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాకబంజర గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత అభినవ వెంకటేశ్వరస్వామి వారి తిరు కల్యాణమహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి పలు రకాల పూజలు నిర్వహించగా.. జయజయధ్వానాల మధ్య స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణం తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వామి వారి కల్యాణానికి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శివాజీ విగ్రహావిష్కరణ

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో సోమవారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. హనుమాన్ సెంటర్‌లోని హనుమంతుని విగ్రహం పక్కన ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ.. హనుమంతుని వీరభక్తుడైన స్వామి సమర్థ రామదాసు శిష్యుడైన శివాజీ ధర్మరక్షణ కోసం పాటుపడ్డారన్నారు. నేటి యువతకు శివాజీ ఆదర్శనీయమని అన్నారు.

'పోడు'కు పట్టాలివ్వాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలో పోడు భూములు సర్వే చేసి పట్టాలు ఇవ్వలేదని, వాటికి వెంటనే పోడు పట్టాలను ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోడు పట్టాలు ఇస్తామని హడావిడిగా సర్వే చేసి పట్టాలు ఇవ్వలేదని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం పట్టాలు ఇవ్వడంలో జాప్యం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మర్మం చంద్రయ్య, రామ్మూర్తి సీతమ్మ, ఆదెమ్మ, లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గం పినపాక మండలం దుగినేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ములుగు జిల్లా మంగపేట మండలం కొత్త మల్లూరు గ్రామానికి చెందిన మాటూరి హనుమంతరావు మరణించాడు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉన్న హనుమంతరావు మృతదేహాన్ని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోమవారం సందర్శించారు. నివాళ్లర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పడంతో పాటు కొంత నగదును ఆర్థిక సాయంగా అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, అక్కి నర్సింహారావు, గుర్రం సృజన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు అందించాలి

మణుగూరుటౌన్: మండల పరిధిలోని వలస గొత్తికోయ గ్రామాల గిరిజనులకు ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఇఫ్టూ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డి.నాజర్‌పాషా మాట్లాడుతూ.. వలస ఆదివాసీ గ్రామాలైన పెద్దిపల్లి, రేగులగండి, విప్పలగుంపు, సర్వాయిగుంపు, బుడుగుల, మల్లెతోగు తదితర గ్రామాల గొత్తికోయలకు ఆరోగ్య శ్రీ కార్డులు లేని కారణంగా వైద్య చికిత్స పొందాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ప్రణయ్‌కుమార్ పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

మణుగూరురూరల్: త్వరలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు విజ్ఞతతో మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పినపాక నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీసీ స్వతంత్ర ఇన్‌చార్జ్ భీమని సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. గత 70ఏళ్లుగా విద్య, ఉద్యోగాల్లో బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. జనాభా ప్రాతిపదికన అన్ని కులాలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలేమి చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా మేధావులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ బీసీ అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి చట్టసభలకు పంపించాలని కోరారు.

సుర్రుమంటున్న సూరీడు

- మధ్యాహ్నం మండుతున్న ఎండలు
- బెంబేలెత్తుతున్న రైతులు, కూలీలు
- వ్యవసాయ పనులకు ప్రతిబంధకాలు



యాసంగి వరిలో కలుపు తీస్తున్న కూలీలు



బూర్గంపాడు: సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఫిబ్రవరి నెలలోనే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. మధ్యాహ్నం సమయంలో బయటకు వచ్చేందుకే జనాలు భయపడుతున్నారు. ఈ తరుణంలో పొలం పనులు చేసే రైతులు, వ్యవసాయ కూలీలు ఎండల తీవ్రతకు బెంబేలెత్తుతున్నారు. ప్రస్తుతం చివరి దశ పత్తితీతలు, మిర్చి కోతలు, మిర్చి గ్రేడింగ్, యాసంగి వరిలో కలుపులు, కూరగాయల కోతలు సాగుతున్నాయి. జామాయిల్ కర్ర నరకటం వంటి పనులు సాగుతున్నాయి. ఎండల తీవ్రతతో అటు రైతులు, ఇటు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వేడిమితో తప్పని తిప్పలు..

ఉదయం 9 గంటలకే ఎండలు మండిపోతుండటంతో పొలం పనులకు ఆటంకంగా మారింది. ఎండల తీవ్రత పెరిగిపోతుండటంతో రైతులు, కూలీలు తెల్లవారుజామునే పొలం పనులకు వెళ్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకే కూలీలు ఇంటిదారి పట్టాల్సిన పరిస్థితులున్నాయి.

ప్రస్తుతం మిర్చి కోతలు, గ్రేడింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎండల తీవ్రతకు మిర్చి కోతకు వెళ్లాలంటే ఉదయం 6గంటలకే కూలీలు బయలుదేరుతున్నారు. దీనికితోడు ఎండల తీవ్రతకు మిర్చి ఘాటును తట్టుకోవటం చాలాకష్టంగా మారుతోంది. మరోవైపు పత్తి తీసేందుకు వెళ్లే కూలీలు కూడా ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జామాయిల్ కర్ర నరికే కూలీలు ఎండలకు అల్లాడిపోతున్నారు. పంటచేల వద్ద పశువులు, కోతులు రాకుండా కాపలా ఉండే రైతులు ఎండలకు ఇబ్బందులు పడుతున్నారు. పంటను కాపాడుకునేందుకు ఎంతటి ఎండైనా చేలలోనే ఉండాల్సి వస్తుంది. కూరగాయలు సాగు చేస్తున్న రైతులు నీటి తడులు పెట్టేందుకు. పైపాట్లు చేసేందుకు ఎండలు ప్రతిబంధకంగా మారాయి. తెల్లవారుజామునే పనులు మొదలు పెట్టి ఎండెక్కే సరికి పనులు ముగిస్తున్నారు.

డీహైడ్రేషన్‌తో జాగ్రత్త..

ఎండల తీవ్రతకు పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు వడదెబ్బకు గురవుతున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుంది. ఎండలో పనులు చేయటంతో రైతులు, కూలీలు డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. డీహైడ్రేషన్‌తో కొందరు కళ్లు తిరిగిపడిపోవటం, కొందరు వాంతులు, విరేచనాలతో బాధపడటం కనిపిస్తుంది. పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తమ పనివేళలను మార్పు చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్త వహించాలి..



ఉదయం పూటనే రైతులు, కూలీలు పొలం పనులను పూర్తిచేసుకోవాలి. పనులు చేసే సమయంలో మంచినీళ్లు ఎక్కువగా తాగాలి. ఎండ మరీ ఎక్కువగా ఉంటే కొద్దిసేపు చెట్టునీడలో సేదతీరాలి. పనులు చేసేటప్పుడు మజ్జిగ, జావ, కొబ్బరిబొండం వంటి ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. పనులు చేసే సమయంలో వడదెబ్బకు గురైతే వెంటనే నీడన పడుకోబెట్టాలి. ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించాలి.

– డాక్టర్ లక్ష్మీసాహితి,
పీహెచ్‌సీ వైద్యాధికారి, మోరంపల్లిబంజర

డీసీసీబీ చైర్మన్ తనిఖీ

దమ్మపేట: ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు ఆదివారం మండలంలో పర్యటించారు. దమ్మపేట కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం, డీసీసీబీ బ్రాంచ్‌ను సందర్శించారు. డీసీసీ బ్యాంకులో పలు రికార్డులను పరిశీలించారు. బ్యాంకులో మేనేజర్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సొసైటీ కార్యాలయం ముందర షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో పాటుగా మండల కేంద్రంలో ఏటీఎంను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా.. స్పందించిన చైర్మన్.. త్వరలోనే పరిశీలిస్తానని అన్నారు. కార్యక్రమంలో దమ్మపేట కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, సొసైటీ డైరెక్టర్ కట్టం ఎర్రప్ప, నాయకులు దారా యుగంధర్, ఎర్ర గొర్ల రాధాకృష్ణ, బండారు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



డీసీసీబీ బ్రాంచ్‌లో చైర్మన్ వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు

నిరంతరాయ విద్యుత్‌కు చర్యలు



కరకగూడెంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డీఈ జీవన్‌కుమార్, సిబ్బంది

కరకగూడెం: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ మణుగూరు డీఈ జీవన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మూడు, భట్టుపల్లిలో ఒకటి మొత్తం నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. తద్వారా విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ కలగకుండా ఉంటుందని, వీటి విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాలను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈ నరేందర్ రెడ్డి, సిబ్బంది రవీందర్, సాగర్, ఉపేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పినపాక: ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా ఇల్లు కాలిపోయిన వెంకటేష్ కుటుంబాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఈ మేరకు సోమవారం సీతంపేట గ్రామంలో పర్యటించిన ఆయన.. ఇల్లు కాలిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం తక్షణ సాయం కింద రూ.5 వేల నగదు అందజేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం

కేజీబీవీలో వీడ్కోలు సభ



చర్ల: పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో మాట్లాడుతున్న ఎంఈఓ

చర్ల: పదో తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే నెలలో జరిగే పబ్లిక్ పరీక్షల కోసం పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని మండల విద్యాశాఖాధికారి పీవీ రమణ సూచించారు. మండల కేంద్రంలోని లక్ష్మీకాలనీలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ రమణ మాట్లాడారు.

విద్యార్థులను పరీక్షల కోసం మానసికంగా సిద్ధం చేయాలని, పరీక్షలంటే భయాన్ని పోగొట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ విద్యాలయం ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'శ్రీవిద్య'లో ఫేర్‌వెల్ డే

మణుగూరురూరల్: మున్సిపాలిటీలోని చేపల మార్కెట్ ఏరియాలోని స్నేహఫంక్షన్ హాల్‌లో శ్రీవిద్య టెక్నో–కృష్ణవేణి జూనియర్ కళాశాల మొదటి సంవత్సర విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం ఫేర్‌వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను కళాశాల కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్, విద్యాసంస్థల డైరెక్టర్ నూకారపు రమేష్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి ప్రవర్తనతో మెలుగుతూ.. క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

అనంతరం విద్యార్థినీ, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో శ్రీవిద్య కృష్ణవేణి విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ సారంగపాణి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుజాత, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి 12 మంది ఎస్జీటీలు

అశ్వారావుపేటరూరల్: డీఎస్సీ–2008లో అర్హత పొందిన అభ్యర్థుల్లో 12 మంది ఎస్జీటీలుగా అశ్వారావుపేట మండలానికి కేటాయించారు. వీరిలో తొలి రోజు 9 మంది అభ్యర్థులు కాంట్రాక్ట్ పద్ధతిలో విధుల్లో చేరారు. ఈ మేరకు వారు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం ఎంఈఓ పి.ప్రసాద్‌రావుకు జాయినింగ్ రిపోర్టులను అందించారు. కాగా, మరో ముగ్గురు విధుల్లో చేరాల్సి ఉంది.

నేటి నుంచి రామక్క జాతర

గుండాల: కొమరం వంశీయుల ఇలవేల్పు రెక్కల రామక్క జాతర మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఆళ్లపల్లి మండలం పెద్దూరు గ్రామానికి చెందిన కొమరం వంశీయులు జాతరను ప్రతీ ఏడాది కొలుస్తూ జాతర నిర్వహిస్తారు. ఈ జాతరలో భాగంగా నేడు కర్రదించుట, దేవతకు కుంకుమ పూజలు నిర్వహించి, గుడిమేలుకొలుపు కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురువారం వన దేవతను గుట్ట నుంచి తీసుకురావడంతో నిండు జాతర ప్రారంభమవుతుంది.

ఇబ్బందులు గురిచేయొద్దు

ములకలపల్లి: బ్యాంకు రుణాలు తక్షణమే చెల్లించాలంటూ ఖాతాదారులను ఇబ్బందులకు గురిచేయొద్దని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. రుణాల చెల్లింపుల పేరిట బ్యాంకు సిబ్బంది ఇళ్లకు వచ్చి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బెదిరింపులకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో ఊకంటి రవికుమార్, మంచాల సారయ్య, గుగులోతు హేమానీ, శనగాని వినోద్, మద్దిబోయిన పేరయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫారం కోడిగుడ్లను నిషేధించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఫారం కోడి గుడ్లను నిషేధించాలని ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో పీఓ రాహుల్‌కి గోండ్వానా సంక్షేమ పరిషత్ ఉభయ రాష్ట్రాల కన్వీనర్ సోందె వీరయ్య వినతిపత్రం అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ విస్తారంగా విజృంభిస్తుండడంతో పాఠశాలలకు సరఫరా చేస్తున్న ఫారం గుడ్లను నిలుపుదల చేసి నాటుకోడి గుడ్లను సరఫరా చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాయం సత్యనారాయణ, పూనెం సాయి, పూనెం వరప్రసాద్, ప్రతాప్, ప్రకాష్, సన్యాసి, సుబ్బయ్య, రవీంద్ర తదతరులు పాల్గొన్నారు.

వీహెచ్‌ఎస్‌ఎన్‌సీ సమావేశం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రంలో సోమవారం విలేజ్ హెల్త్ శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ కమిటీ (వీహెచ్‌ఎస్‌ఎన్‌సీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్లు గర్భిణులు, కిషోర బాలికలు, షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పరంగిని, జానకి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భవానీ లింగమంతుల జాతర

అశ్వాపురం: అశ్వాపురం, మణుగూరు మండలాల సరిహద్దులోని మారుమూల రేగులగండి గ్రామంలో గుట్టపై వెలసిన లింగమంతుల స్వామి ఆలయం ఆవరణలో యాదవుల ఆరాధ్య దైవమైన భవానీ లింగమంతుల స్వామి జాతర సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతర నిర్వహణ కమిటీ, అశ్వాపురం, మణుగూరు మండలాల యాదవ సంఘం పెద్దలు, నాయకుల ఆధ్వర్యంలో సూర్యాపేట పెద్ద గట్టు జాతరకు అనుసంధానంగా రేగులగండి గుట్టపై ఈ జాతర చేపట్టారు. ఆదివారం రాత్రి శివభవాని రథాలలో రేగులగండి చేరుకున్న యాదవులు.. సోమవారం ఉదయం 5 గంటలకు శ్రీ భవాని లింగమంతుల స్వామి, చౌడాలమ్మలకు పెద్ద ఎత్తున బోనాల సమర్పణతో జాతరను ప్రారంభించారు. పూజారుల వేదమంత్రాలు భక్తుల జయజయ ధ్వానాల మధ్య శ్రీ భవాని లింగమంతుల స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. జాతరలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే పాయం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఒగ్గు కళాకారులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సింగరేణి యాజమాన్యం, జాతర నిర్వహణ కమిటీ, అశ్వాపురం, మణుగూరు యాదవ సంఘం నాయకులు తగిన ఏర్పాట్లు చేశారు.



భవానీ లింగమంతుల స్వామి కల్యాణంలో మంగళహారతి ఇస్తున్న భక్తులు

తునికాకు ప్రూనింగ్ పనులు చేపట్టాలి

మణుగూరుటౌన్: ఏజెన్సీలో ఆదివాసులకు ఆదాయం తెచ్చిపెట్టే తునికాకు ప్రూనింగ్ పనులు వెంటనే చేపట్టాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మణుగూరు ఎఫ్‌డీఓ మక్సూద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలోనే కొమ్మ కొట్టుట పనులను ప్రారంభిస్తే నాణ్యమైన తునికాకు వస్తుందన్నారు. కానీ నేటి వరకు పనులు ప్రారంభించకపోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు కొడిశాల రాములు, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మడి నర్సింహారావు, కొండ్రు గౌరి, బొల్లం రాజు, సంకినేని వెంకట్రావ్, బిజ్జా సమ్మక్క తదితరులు ఉన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లో తునికాకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి తునికాకు ప్రూనింగ్ పనులను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎఫ్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఎఫ్‌డీఓ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు మచ్చా వెంకటేశ్వర్లు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ.. ఏజెన్సీలోని గిరిజనులు, ఇతర పేదలకు తునికాకు సేకరణ రెండవ వేసవి పంటగా ఉపాధి కల్పిస్తోందని, అటువంటి తునికాకు సేకరణ ప్రక్రియను ప్రారంభించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తుందని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాక శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి, మర్మం చంద్రయ్య, రామ్మూర్తి, ఆదయ్య, సుజాత పాల్గొన్నారు.



భద్రాచలంటౌన్: ఎఫ్‌డీఓ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీ



గోరుకొండలో విద్యార్థుల ప్రగతిని తెలుసుకుంటున్న ఎంఈఓ పీవీ రమణ

చర్ల: మండలంలో మారుమూల ప్రాంతాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి పీవీ రమణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బట్టిగూడెం, రాళ్లపురం,గోరుకొండ, దోశిళ్లపల్లి గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేసి విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. మారుమూల గ్రామాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయులు సక్రమంగా, సమయానుకూలంగా వెళ్లడం లేదంటూ వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఎంఈఓ ఈ తనిఖీలు చేపట్టారు. ఆయన వెంట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

సేవాలాల్ జయంతి వేడుకలు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని శేష గిరినగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన సద్గురు సంత సేవాలాల్ జయంతి వేడుకల్లో సోమవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. బంజారాల కుల దైవమైన సద్గురు సంత సేవాలాల్ సేవలను గుర్తుచేస్తూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, సేవాలాల్ సేన రాష్ట్ర కో–కన్వీనర్ బానావత్ హుస్సేన్ నాయక్, సేవాలాల్ సేన, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా నిర్మల, మణుగూరు మండల అధ్యక్షుడు గుగులోత్ రవికుమార్, గౌరవ అధ్యక్షుడు గుగులోత్ రమేశ్, ఇస్లావత్ ద్వాలి, గుగులోత్ కవిత, అజ్మీరా రాజేశ్, భుక్యా బాలకృష్ణ, బానోత్ శాంతి, ఇస్లావత్ శ్రీను, భుక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల నిరసన

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణ సర్వేలో మున్నూరు కాపుల వివరాలను తప్పుగా చూపించినట్లు ఆ సంఘం బాధ్యులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆ సంఘం మండల అధ్యక్షుడు కురిశెట్టి నాగబాబు ఆధ్వర్యంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ.. స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు యూఎస్ ప్రకాశ్‌రావు, కట్టా శ్రీను, చిక్కల గోపాలకృష్ణ, పాశం రామారావు, కట్టా సుబ్బారావు, కొల్లు రమేష్, బండి సురేష్, కర్నాటి నాగేశ్వరరావు, సత్తిబాబు, బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు చర్యలు



పోతిరెడ్డిపల్లి గ్రామస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

పినపాక: క్షయ వ్యాధి వ్యాపించకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని పినపాక ప్రభుత్వ వైద్యురాలు దుర్గాభవాని తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలోని ఈ బయ్యారం గ్రామపంచాయతీలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు క్షయ వ్యాధి నిర్మూలనకు వంద రోజుల ప్రణాళిక సిద్ధం చేశామని అందులో భాగంగా అన్ని పంచాయతీల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ జన్మదిన వేడుకలు

మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్‌లు కట్‌చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. కేసీఆర్‌కు గుర్తుగా కొందరు మొక్కలు నాటారు. ఇంకొందరు ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. ఆలయాల్లో పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మరోవైపు కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తూ.. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ నాయకులు



బూర్గంపాడు: రక్తదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు



భద్రాచలంటౌన్: మొక్కలు నాటుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గారాంప్రసాద్ -9000327175. టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎస్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416